

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

హాయి హాయిగా ఆమని సాగే
సోయగాల గనవోయీ సఖా
హాయి సఖా!
కుహూ కుహూ బోలే కోయలియా
కుంజ్ కుంజ్ మే భవ్రే డోలే
గున్ గున్ బోలే.

'సువర్ణ సుందరి' సినిమా పేరు వినగానే గుర్తొచ్చే మధురమైన గీతం ఇది. తెలుగు, హిందీ, తమిళ భాషలలోనూ సూపర్ హిట్ గా నిలిచిన చిత్రం 'సువర్ణసుందరి'. తెలుగువారికి మాయాబజార్, పాతాళభైరవిలు ఎంతగా తెలుసో సువర్ణ సుందరి గురించీ అంతగా తెలుసు. Cult Classic సినిమాలలో ఇదొకటి. ఈ పాట గురించి మ్యూజికాలజిస్టుగా ప్రసిద్ధి పొందిన రాజాగారు తన వెబ్‌సైట్‌లో చక్కగా రాశారు.

సముద్రాల సీనియర్ పాటను రచించగా ఆదినారాయణరావు సంగీత దర్శకత్వం వహించారు. ఘంటసాల, జిక్కి ఈ పాటను పరమ మధురంగా తేనెలూరే రీతిలో, శృంగార రస ప్రవాహంలో శ్రోతను ఓలలాడించే రీతిలో గానం చేశారు. ఈ పాటను సంగీత పరంగా 'రాగమాలిక'గా అభివర్ణించవచ్చు. ఎందుకంటే పాట ప్రతి చరణం ఒక ప్రత్యేక రాగం. ఆధారితం అంటే ఒకో చరణం ఒకో రాగం. అలా రాగమాలికను తయారు చేశారన్నమాట సంగీత దర్శకులు. రాజాగారి ప్రకారం 'పల్లవి నుండి మొదటి చరణం వరకూ హంసానంది రాగం, 'ఏమీ తటల్లతిక' చరణం దర్బారి కానడ రాగంలో, 'చూడుమా చందమామ ' బహార్ రాగంలో 'కనుగవ కనియగ ' చరణాన్ని కళ్యాణి రాగంలో సృజించి ఈ విభిన్న రాగాలు, ఒక రాగంలోంచి మరో రాగంలోకి ప్రవేశించటాన్ని ఎలాంటి జర్క్‌లు లేకుండా అన్నిటినీ ఒకే ప్రవాహధారలా అత్యంత అద్భుతమైన రీతిలో రూపొందించారు.

దేన్నయినా సృజించటం అత్యంత అద్భుతమైన విషయం. ఒక కళాకారుడు ఎంతో శ్రమించి, తపన పడి, తన ప్రతిభాపాటవాలను మధించి గీతాన్ని దర్శిస్తాడు. రాగాలనుండి గీతాన్ని బంగారాన్ని తీగలా సాగదీసినట్టు సాగదీస్తాడు. బయట ప్రపంచానికి బంగారం ముద్దనుండి సుందరమైన ఆభరణాలను సృజించటం వెనుక ఉన్న శ్రమ, తపనలు తెలియవు. వారు బంగారు ఆభరణాన్ని చూస్తారు. అలాగే ఒక శిల్పి బండరాయిని సుందరమైన శిల్పంలా తీర్చిదిద్దటం, శిల్పంలో ప్రతి అంశాన్నీ అతి జాగ్రత్తగా రూపొందించటం దర్శించి ఆశ్చర్యపోతాం. అద్భుతం అని పొగుడుతాం. కానీ ఆ సృజన వెనుక ఉన్న తపనను, శ్రమను, కళాకారుడి కళాభినివేశాన్ని అర్థం చేసుకోలేం. ఆ ఊహ కూడా రాదు. ముఖ్యంగా సినిమా పాటల సృజనకు ఇది ఎంతో వర్తిస్తుంది. ఒక గీతాన్ని రూపొందించటం వెనుక ఉండే శ్రమను, సృజనాత్మక ఆవేశాన్ని ఊహించటం కుదరదు.

సినిమా పాటలను తేలికగా కొట్టేస్తారు చాలామంది. సినిమా పాటలలో ఉండేది సాహిత్యం కాదంటారు. ఎంతో శ్రమపడి పండితులకు మాత్రమే పరిమితమైన రాగాలను, భావాలను, పదాలను సామాన్య మానవుడికి చేరువచేసి, వారి నిత్యజీవితంలో భాగం చేస్తున్న కళాకారుల ప్రతిభను నీరుగారుస్తారు. అలాంటి వారు ఒక్క నిమిషం ఆలోచిస్తే 'కళ'లో 'క్లాసు'భేదాలు లేవని అర్థం చేసుకుంటారు. సమాజం ముందు ఉత్తమ ఆదర్శాన్ని, ఉత్తమ భావాలను, ఉన్నతమైన రీతిలో నిలిపేది 'ఉత్తమ కళ' అని అర్థం చేసుకుంటారు.

'హాయి హాయిగా' పాటలోని సాహిత్యం అత్యుత్తమం. భావం పరమ రమణీయం.

**లీలగా పువ్వులు గాలికి ఊగ**

**కలలోన తలపుల వలపులు రేగ**

**ఊగిపోవు మది ఉయ్యాలగా, జంపాలగా...**

చరణంలో 'ల'కార ప్రయోగం ఒకరకమైన మృదుత్వాన్ని, శృంగార పరమైన స్నిగ్ధత్వాన్ని కలిగిస్తుంది.

కవులు పద్యాలు రచించేటప్పుడు ఎన్నుకునే పదాలు వారు ప్రకటించే భావాన్ని ఉద్దీపితం చేసే ధ్వనిని సృజించే పదాలపై దృష్టి పెడతారు. ఇక్కడ భావం మృదు మధురం. పువ్వులు గాలికి ఊగుతూంటే, అతడి మదిలో ప్రేమ భావనలు కలిగి హృదయం జంపాలలూగిందట.

**కమ్మని లతాంతములు కుమ్మొనసి**

**వచ్చు మధుపమ్ముల సంగీత నినదమ్ము లెగసెంజూ**

**తమ్ముల లసత్కిసలయమ్ముల సుగంధి**

**ముకుళమ్ములను నానుచు ముదమ్మొనర వాచా**

**లమ్ములగు కోకిల కులమ్ముల రవమ్ము**

**మధురమ్మగుచు విచ్చె ననిశమ్ము సుమనోభా**

**రమ్ముల నశోక నికరమ్ములను జంపక**

**చయమ్ములను గింశుక వనమ్ములను నొప్పెన్!**

ఈ పద్యం మహాభారతం ఆదిపర్వంలోనిది. నన్నయ సృజన. ఇది శృంగార భావనకన్నా మధురభావాన్ని కలిగిస్తూ సుందరమైన వనాలను కళ్లముందు నిలిపే పద్యం. ఈ పద్యంలో 'ద్విత్వ మకారం' పదే పదే వస్తూ చదవటంలో ఆనందాన్ని కలిగిస్తుంది. చెవులకింపుగా ఉంటుంది. సందర్భాన్ని బట్టి, ప్రత్యేక భావాన్ని ఉద్దీపితం చేసే శబ్దాన్ని పదేపదే వాడటం కనిపిస్తుంది. హాయి హాయిగా పాటలో మొదటి చరణంలో 'ల'కార ప్రయోగం ఇలాంటిదే. సినిమా సాహిత్యాన్ని చులకనగా చూసేవారు గమనించాల్సిన విషయం ఇది.

సాధారణంగా ఒక భాషలో 'హిట్' అయిన సినిమాను గానీ, పాటను గానీ ఇతర భాషల్లోకి తర్జుమా చేసి వాడటం జరుగుతుంది. సినిమాను 'డబ్' చేయడమో, రీమేక్ చేయటమో సాధారణం. సువర్ణ సుందరినీ హిందీలో 'రిమేక్' చేశారు. పాటలు అవే. నటీనటులు వారే. స్క్రిప్టు అదే. ఇలాంటి సందర్భాలలో ఒక భాషనుంచి మరో భాషకు అనువాదం చేసే వారు కత్తిమీద సాము చేయాల్సి ఉంటుంది. 'రీమేక్' కాబట్టి సంభాషణ రచయితలకు వెసులుబాటు ఉంటుంది. కానీ అవే పాటలకు, అదే భావంతో పునః సృజించేటప్పుడు గేయ రచయిత అసిధార వ్రతం చేయాల్సి ఉంటుంది. స్వేచ్ఛగా రాసే వీలుండదు. భావం మూలాన్ని ప్రతిబింబించాలి. రాగం చెడకూడదు. ఒక భాషనుంచి మరో భాషకు మారేటప్పుడు పదాల వాడకంలోనూ, భావప్రకటన పద్ధతిలోనూ తేడా వస్తుంది. ముఖ్యంగా తెలుగు నుంచి హిందీలోకి మార్చే సమయంలో భాషతోపాటు రాగంతోనూ సమస్య వస్తుంది.

హిందీ సరళమైన భాష. ద్విత్వాక్షరాలు తక్కువ. అయితే 'హాయి హాయిగా' పాటను హిందీలోకి మార్చటంలో ఒక వెసులు బాటు ఉంది. తెలుగు పాటలోనూ ద్విత్వాక్షరాలు బహు తక్కువ. సంగీత దర్శకుడు ఆదినారాయణరావుకు హిందుస్తానీ సంగీతంపై పట్టు ఉంది. మక్కువ ఎక్కువ. అదీగాక ఆదినారాయణ రావు సృజించిన పాటలను గమనిస్తే, ఆయన పాటల్లోనూ ద్విత్వాక్షరాలు అతి తక్కువగా వుంటాయి. అంటే ఆయనకు కర్ణాటక సంగీతం హిందుస్తానీ సంగీతాల నడుమ ఉన్న వ్యత్యాసాలు తెలుసు. వాటిని సమర్ధవంతంగా మార్చటం తెలుసు. అది ఈ పాటలో స్పష్టంగా తెలుస్తుంది. అదే పాట, అవే సమాన రాగాలు. కానీ అతి స్వల్ప మార్పులతో హిందీ పాటను తెలుగు పాటకు కాస్త భిన్నంగా రూపొందించాడు. కానీ ఎంతో జాగ్రత్తగా వింటే తప్ప తేడాను గుర్తించటం వీలుపడదు. రెండూ ఒకే రకంగా అనిపిస్తాయి. ఇది పల్లవిని గురువు లఘువుల విభజన స్పష్టం చేస్తుంది.

**హాయి హాయిగా ఆమని సాగే**

**కుహూ కుహూ బోలే / కోయలి/యా**

**సోయగా/ల గన / హాయీ స/ఖా**

**కుంజ్ కుం జ్ మే భ్రవే డోలే**

**హాయీస /ఖా**

**గున్ గున్ బో/లే**

హంసనందికి సమానమైన రాగం సోహ్ని. హంసనందిలో ఆరు స్వరాలుంటాయి. ఆరోహణలో సరి,గ మ  ద ని  స అవరోహణలో స ని  ద  మ  మ  గ  రి, స.

సోహ్ని రాగం ఆరోహణలో సగమ ధనిస, అవరోహణలో సనిధగమ ధ గమ గరిస స్వరాలుంటాయి. ఈ స్వల్పమయిన భేదాలకు పాటలో ప్రతిబింబిస్తూ రూపొందించిన తీరు అద్భుతం 'డబ్బింగ్' చేస్తే ఇంత అద్భుతంగా పాటను రూపొందించటం కుదిరేది కాదు. 'రీమేక్'లో ఉన్న సౌలభ్యం ఇది. అంటే రెండు భిన్నమైన పాటలు ఒకే పాటగా ధ్వనింపచేసి మురిపింప చేసే ఇంద్రజాలం అన్నమాట మన కళాకారులు చేసింది.

ఇక్కడే గేయ రచయిత భరత్ వ్యాస్ గొప్పతనం ప్రస్ఫుటమయ్యేది. హిందీ సినీగేయ రచన ప్రపంచంలో భరత్‌వ్యాస్ లాంటి గీత రచయిత మరొకరు లేడు. భరత్ వ్యాస్ తన గీతాలలో 'శుద్ధ హిందీ' వాడతాడు. ఆ కాలంలో సినీగీతాలలో ప్రధానంగా 'ఉర్దూ' వాడేవారు.

ఉర్దూ, హిందుస్తానీ కలిపి వాడేవారు. 'హిందుస్తానీ' అంటే మొఘులుల కాలంలో సైనికులు, సామాన్యులు మాట్లాడే భాష. హిందీ అందుకు భిన్నమైనది. హిందీ సంస్కృతం నుండి రూపొందిన అతి శుద్దంగా, శుభ్రంగా వాడిన ఏకైక సినీగేయ రచయిత భరత్ వ్యాస్. శుద్దమైన హిందీ తేనె ప్రవాహంలా తీయగా, చక్కగా, మధురంగా ఉంటుంది.

'నవరంగ్' సినిమాలో హోలీ పాటలోని పదాలను గమనిస్తే భరత్ వ్యాస్ ప్రతిభ తెలుస్తుంది.

**అటక్ అటక్ ఝూట్ పట్ పన్ ఘట్ పర్**

**చటక్ మటక్ ఎక్ నార్ నవేలీ**

**గోరి గోరి గ్వాలన్ కీ ఛోరీ చలీ**

చోరీ చోరీ ముఖ్ మోరీ మోరీ మస్కాయే అల్బేలీ'కంకరి గలె మె మారీ కంకరీ కణయ్యానే

పకరీ బాహ ఔర్ కీ అట్ ఖేలీ'భరీ పిచకారీ మారీ

'స్త్రీ' సినిమాలోని ఈ పాట గమనించండి.

'కౌన్ హో తుం కౌన్ హో' అనే పాటలో నాయిక ఎవరని నాయకుడు ప్రశ్నించటంలోని ఉదాత్తత ఔన్నత్యం, ఉత్తమ భావం, అత్యుత్తమ పద ప్రయోగం గమనించండి.

**కవికీ మధుర్ కల్పనా హోం**

**యా గాయంక్‌కీ మధురిమ తాన్**

**యా సరిత్ ఆజల్ కీ తరంగ్ హో**

**అరుణ కమల్ కీ మధుముస్కాన్.**

ఎదను ఉప్పొంగింపచేసే భావం. అతి సరళము, తరళము, మృదుమధురము అయి తేనెలూరే పదాలు. ఇది శుద్ధ హిందీ పదాల, గొప్పతనం 'దో ఆంఖే బారా హాథ్ ' సినిమాలో వర్షాన్ని వర్ణిస్తూ పాడే పాటలో వర్షపు వర్ణన సాహిత్య ప్రపంచంలోని ఏ ఉత్తమ కవితకూ తీసిపోదు.

**జబ్ సనన్ పవన్ కో లగా తీర్**

**బాదల్ కో చీర్ నికలా రే నీర్**

**ఝుర్ ఝుర్ ఝుర్ ఝుర్ అబ్ ధార్ ఝురే**

**ఓ ధర్తీ జల్ సే మాంగ్ భరే**

**ఓ ఉమడ్ ఘుమడ్ కర్ ఆయి రె ఘటా**

**కారే కారె బద్ రా కీ ఛాయీ – ఛాయీ రే ఘటా**

నల్లటి మేఘాల గుంపులు పరుగు పరుగున ఆకాశం నిండాయి. వేగంగా వీచే గాలి బాణం తాకగానే మేఘాలను చీల్చుకుని బయటకు జరజరా జారింది నీటిధార. భూమి నీటిని తన పాపిట సింధూరంలా ధరించింది తృప్తిగా. అద్భుతమైన వర్ణన, అద్భుతమైన పదాలు. ఎక్కడా ఒక్క ఉర్దూ పదం పొరపాటున అయినా కనిపించదు భరత్ వ్యాస్ గేయ రచనలో. అలాంటి భరత్ వ్యాస్ 'హాయి హాయిగా ఆమని' పాటను హిందీలో రచించాడు. అత్యద్భుతమైన ఎంపిక. ఇందుకు ఆదినారాయణరావును అభినందించక తప్పదు. ఎందుకంటే అకాలంలో సాహిర్, శైలేంద్ర, మంజ్రూహ్, షకీల్, రాజేంద్ర కిషన్ వంటివారు గేయరచన ప్రపంచాన్ని ఏలుతున్న కాలం. దీన్లో శైలేంద్ర, రాజేందర్ కిషన్లు సరళమైన హిందీలోనూ ఇటు ఉర్దూ షాయరీలోనూ గీతాన్ని సృజించటంలో సమర్థులు. పైగా రాజేందర్ కిషన్ దక్షిణ అనువాద చిత్రాలకు స్క్రిప్టుతోపాటు గీతాలను కూడా రచించేవాడు. 'బృందావనమది అందరిది' పాటను 'బృందావన్ కీ కృష్ణ కనయ్యా సబ్‌కే ఆంఖోనా తారా' అని అందంగా అనువదించినవాడు అలాంటి ఉద్దండులను కాదని భరత్ వ్యాస్‌ను ఎన్నుకోవటం ఆదినారాయణను గేయరచయితల ప్రతిభా పాటవాలు, వారి రచన శైలిపై అవగాహన ఉండటంతో పాటు తనకేం కావలో స్పష్టంగా తెలుసున్న విషయాన్ని విస్పష్టం చేస్తుంది.

తెలుగు పాటలో వసంతం ప్రస్తావన ఉంది. వసంతంలో పూలు విరగబూస్తాయి. కోయిల కూస్తుంది. అందుకే తెలుగులో ఊగే పూలను చూస్తూ నాయకుడి హృదయం ఊగుతుంది. నాయిక వసంతం సోయగాలను చూడమంది నాయకుడిని. మార్మికమైన శృంగార భావన ఇది. యువతి యవ్వనావిర్భావాన్ని విరబూసిన వసంతంలోని పూదోటతో పోలుస్తారు శృంగార కవులు. ఆమె విరబుసిన వసంతంలోని సోయగాలను చూడమనటంలోని చమత్కారం నాయకుడు ఊగే పూలతో మనసూగుతోదనటం అతి సున్నితమైన శృంగారం. దీన్ని హిందీలోకి భరత్ వ్యాస్ కేవలం భావం తీసుకుని స్వతంత్రంగా హిందీ కవిత పద్ధతులలో ప్రదర్శించిన తీరు పరమాద్భుతం.

కోకిల కూత వసంతాగమనానికి సంకేతం. అందుకని కోయిల కుహు కుహు మంటూ కూసిందంటోంది. కోకిల కూయటంతో పూలు విరిశాయని అర్థం. తేనెటీగ పూలపై వాలుతోందంటోంది. సాహిత్యంలో తేనెటీగ పురుషుడిని సూచిస్తుంది. పూలు స్త్రీకి ప్రతీక. భ్రమరం పూలపై వాలుతూ తేనెను గ్రోలుతుంది. ఇది శృంగార సంకేతం. దాన్నే పల్లవిలో సూచించాడు కవి భరత్ వ్యాస్. తెలుగులో, హిందీలో భావం ఒకటే. కానీ భావాన్ని వ్యక్త పరచిన పద్ధతివేరు. స్థానిక భావాలు, సున్నిత భావనలతో తెలుగులో 'ఆమని'ని, 'హిందీ'లో కోయిల కూతలతో ప్రతిధ్వనింపచేసి మనసును రంజింపచేస్తాడు కవి. హిందీ పాటకు మూలం తెలుగు పాట. తెలుగు పాట 'హిమాలయ శిఖరం'. దానికి సాటి మరొకటి లేదు. అలాంటి శిఖరానికి దీటుగా హిందీ పాటను నిలిపాడు భరత్ వ్యాస్. ఇది కవి గొప్పతనం. కవి ప్రతిభకు, గేయ రచనా నైపుణ్యానికి నిదర్శన.

ఈ గేయ రచనా సంవిధానం వల్ల హిందీ తెలుగు పాటల రాగంలో వచ్చిన తేడాలు మనసుకు పట్టవు. రెండూ ఒకేరకంగా అనిపిస్తాయి. 'ఏ పాట బాగుంది?' అన్న మీ మాంస పక్కన పెడితే రెండు హిమాలయ శిఖరాలే. దీనికి ఏదీ తీసిపోదు. కానీ హిందీ పాటకు జాతీయ స్థాయిలో అవార్డు రావటం, తెలుగు పాటకు కనీసం రాష్ట్ర స్థాయిలో కూడా గుర్తింపు లభించక పోవటం, ఆశ్చర్యం మాత్రమే కాదు ఆవేదనను కూడా రగిలిస్తుంది. అయితే, తెలుగు మూలానికి 'హిందీ' రంగులద్ది పాటను మరింత సుందరం చేసిన భరత్ వ్యాస్ ప్రతిభను గమనిస్తే, ఆవేదన తగ్గుతుంది 'తెలుగు'ను జాతీయ స్థాయిలో ప్రాజెక్ట్ చేసుకోలేకపోయిన మన అసమర్థత స్పష్టమవుతుంది.

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments